
# సవ్వాల చెన్నా

రావిరాల బుచ్చయ్య




తూర్పున తెల్లవారింది.

నోట్లో వేపపుల్ల నములుతూ ఇంటి ముందు వాకిట్లో అరుగుమీద కూర్చున్నాడు మారయ్య. భార్య నాగమ్మ వాకిలి ఊడ్చి కళ్లాపు చల్లుతోంది. యాదగిరి గుర్రు పెట్టి నిద్రపోతున్నాడు.

కొడుకు యాదగిరి భవిష్యత్తు గురించే నాగమ్మ దిగులు. డిగ్రీ పాసై రెండేళ్ళైనా ఎక్కడా ఉద్యోగం రాలేదు వాడికి. పగలంతా సర్టిఫికెట్లు చేతితో పట్టుకొని కాళ్ళరిగేలా తిరుగుతున్నాడు. ఇంటికి చేరేసరికి రాత్రి పదకొండు అవుతోంది. పల్లెలకు రాత్రి పూట బస్సులు గూడా సరిగా దొరకవాయె. వాడు పడుతున్న కష్టాన్ని తలచుకుని గుడ్లనీరు కుక్కుకొంటున్న నాగమ్మ మారయ్య పిలుపుకు ఉలిక్కి పడింది.

"ఇగో పిలగాడు ఇంకా లేవ లేదా! పొద్దెక్కి పోతుంది" భార్య నాగమ్మను చూస్తు అన్నాడు మారయ్య. "ఆడు పట్నంలో తిరిగి తిరిగి అలిసిపోయి అర్ధరాత్రి ఇంటికొచ్చిండు అన్ని కాస్త పొద్దెక్కిందాక పండుకోనియ్యరాదా" బకెట్లో కళ్ళాపు కలుపుతూ అంది నాగమ్మ. "ఆడు పండుకుంటే నాకేందిగాని, గిరాకీలువచ్చే ఏలవుతుంది. మనకున్నదేమో చిన్నకొంపనాయె. వచ్చినోళ్లను నాకొడుకు నిద్రపోతుండు ఆడు లేచినంక రమ్మని చెప్తమా! ఏంది?" వ్యంగ్యంగా ప్రశ్నించాడు మారయ్య. "నువ్వయితే పలుగర్ర పారేసి మొఖం కడుక్కోరాదు. గోలెంల నీళ్ళున్నయ్ ఇంతల ఆడు

లేస్తడు. సాప సుట్టి మూలకు బెడితె సరిపాయె'' అంటూ నాగమ్మ నీళ్లు చల్లడం పూర్తి చేసింది. నీళ్లకోసం బిందెలతో బజారు బావికి వెళుతూ... ''జర పొద్దెక్కితే బాయికాడ మంది ఎక్కువైతరు దబ్బున పోయి నాలుగు బిందెల నీళ్లు దెస్త జర ఇంట్లకు కుక్కలు రాకుండ సూడు'' అంటూ బావివైపు వెళ్లింది.

మారయ్య ఊరు అంత పెద్దది కాదు అలా గని పూర్తిగ గూడెముకాదు. ఆ ఊరిలో సుమారు నాలు గొందల ఇళ్లుంటాయ్. ఆ ఊరంతటికి పూర్వం నుంచి తన తండ్రి ఒక్కడే క్షురకర్మ చేసేవాడు. ఆయన తర్వాత తను ముగ్గురు అన్నదమ్ములూ ఊళ్లో ఇళ్లు పంచుకున్నారు. తండ్రి కట్టించిన ఇల్లు భాగాలుగా చేయడంతోపాటు ఊరి ఖాతాలూ భాగాలుగా పంచుకోవలసి వచ్చింది. భాగాల పంపకంతో మారయ్య ఇల్లు చిన్నదిగా మారిపోయింది. రైతు కుటుంబాలలో పోయివేరే కులవృత్తులు చేసుకొనే ఇళ్లు కూడ తన వంతుకు వచ్చాయి. అలా సంవత్సరాలు గడిచిపోయాయి. సంవత్సరాల పైబడి వయసు వచ్చేసింది. కంటిచూపు కూడా సరిగ్గా ఆనదు. సోడాబుడ్డి కళ్లద్దాలు పెట్టుకుంటాడు. ఇద్దరు ఆడ పిల్లల తర్వాత యాదగిరి పుట్టాడు. ఇద్దరమ్మాయిల పెళ్లిళ్లు సమీపంలో ఉన్న గ్రామాలలోనే కులవృత్తి చేసుకొనే వారికి ఇచ్చిచేశాడు. ఒక్కగానొక్క కొడుకును మాత్రం ఎట్టి పరిస్థితుల్లోను కుల వృత్తిలో పెట్టకూడదని చిన్నప్పట్నుంచి వాడిని బడికి పంపించాడు. యాదగిరి చాలా తెలివైన వాడని బడిలో ఉపాధ్యాయుడు పదే పదే చెప్పడంతో వాడిని బాగా చదివించాలనే గట్టి నిర్ణయాలతో నానా తంటాలు పడి డిగ్రీ పూర్తి చేయించాడు. వాడిని కాలేజీకి పంపించేపుడు ఊళ్ళో వాళ్ళు ఎన్నో రకాలుగా మాట్లాడారు. స్కూల్ ఫైనల్‌తో ఆపేయమని ఉచిత సలహాలిచ్చారు. తమ వంశంలో ఇంతవరకు డిగ్రీ ప్యాసేయినవాడు తన కొడుకే కావడం మారయ్యకు ఎంతో గర్వంగా ఉంటుంది. చుట్టువక్కల గ్రామాలలోని వారు కూడా తన కొడుకు గురించే చెప్పుకుంటుంటారు. ఒకసారి షావుకారు రంగయ్యను ఫీజు కట్టాలసి ఉంది మూడొందల రూపాయలు అప్పు ఇవ్వమని అడిగితే ''ఒరేయ్ మారయ్యా అతంత పెద్ద సదువులు మీకెందుకురా! మంచి మంచి ఏటేండ్ల కొడుకులనే పట్నం పంపించలేక వ్యవసాయంలో పెడతుండ్రు'' అని పదిసార్లు ఇంటి చుట్టు తిప్పించుకొని డబ్బు ఇచ్చాడు మారయ్య. కొడుకు పట్నంలో డిగ్రీ చదవడం ఊరిలో చాలా మందికి అయిష్టంగానే ఉండేది. చాలా కొద్దిమంది మాత్రమే మారయ్య కొడుకును చదివించమని ప్రోత్సహించారు. మారయ్య రోజు ఆదాయం ఏమీ ఉండదు. పంటల నూర్పిళ్లు సమయంలో రైతులకు వారికి తోచినంత ధాన్యం ఇస్తుంటారు. ఖాళీ సమయంలో ఊరిలో దొరికే కూలీ పని చేసుకోవడం అతని కుటుంబానికి జీవనాధారం.

మారయ్య నీళ్ళతొట్టె దగ్గర ముఖం కడుక్కొని తలకు కట్టుకున్న రుమాలు విప్పి తుడుచుకుంటున్నాడు. ''మారయ్య నేను అర్జంటుగ చుట్టాలింటికి పోతుండ జర గడ్డం చెయ్యి'' అంటూ తొందరలో వచ్చాడు సూరయ్య.

''ఒరేయ్ యాదగిరి పొద్దెక్కింది ఇగలె. సూరయ్యకు గడ్డం చెయ్యాలే. నడింట్లో నువ్వట్లపండుకుంటె నేనా పని ఎట్లా చేసేదిర'' అంటూ వాకిటిలో నుంచే కేకవేశాడు. ''ఆ లేస్తున్న'' నంటూ యాదగిరి లేచి చాపచుట్టి మూలకు పెట్టి బయటికి వచ్చాడు.



రాజకీయ నాయకుడు కోపంగా అడిగాడు ఎడిటర్ని ''నా గురించి అన్నీ అబద్ధాలే రాస్తున్నారు మీ పత్రికలలో''

''అందుకు మీరు కృతజ్ఞతలు చెప్పాలి. నిజాలు రాస్తే మీకు మరింత నష్టం.''

వి.వెంకటేశ్వర్లు ,[హైదరాబాద్]

''ఈడు ఇంట్లనె ఉన్నాడా? నీ ఉద్యోగం ఎంత వరకు వచ్చిందిరా యాదగిరి'' సూరయ్య గడ్డం నిమురుకొంటూ యాదగిరివైపు చూశాడు.

''ప్రయత్నాలు జేస్తున్నా కాని ఫలితం మాత్రం కనపడటంలే'' అంటూ తండ్రి ఖాళీచేసిన అరుగుమీద కూర్చున్నాడు యాదగిరి.

మారయ్య పీటవేసి సూరయ్యను కూర్చోమన్నాడు. మారయ్య సామాన్లపొది తెచ్చి ముందుపెట్టుకొని సూరయ్య గడ్డానికి నీళ్లు రుద్దడం ప్రారంభించాడు. ''ఏమోర'' ఎద్దున్నోనికి బుద్ధిలేదు. బుద్ధి ఉన్నోనికి ఎద్దు లేదు'' అన్నట్లు మా పోరగాల్లని చదువుకో అంటే పదో తరగతిలోనే పేలయిపోయి వ్యవసాయం చేస్తుండ్రు. మీ వోడేమో పెద్ద చదువులు చదువుతున్నాడు. ఎంతయినా మారయ్య నువ్వు అదృష్టవంతుడివిరా'' అన్నాడు సూరయ్య.

''ఆ ఏం అదృష్టమో! ఆనికేదైన నౌకరి దొరికితె నా కష్టం తీరిపొద్ది. అదేదో నౌకరీ పరీక్షలని రెండ్రోజులకోసారి పట్నం పోయొస్తుండు. ఎక్కడలేని పైసలు ఖర్చు అవుతున్నాయ్''. ఎంతైనా మీ వోడు తెలివిగలవోడు లె! హుషారంటె గట్లుండాలె'' మెచ్చుకున్నాడు సూరయ్య.

''ఆడ్ని చదివించడానికి నేనెంత కష్ట పడ్డనో మీకు తెల్వదా?'' అవును మల్ల కష్టపడందె ఫలితం ఎట్లొస్తది సెప్పు. రేపు నీ కొడుకు మంచి నౌకరి చేస్తె నిన్నా నీ పెండ్లాన్ని కూసబెట్టి సాదడు మరి''?

''ఆడు మమ్మల్ని సాదినా సాదకపోయినా ఫర్వాలే ఆడన్న ఈ వృత్తి చెయ్యకుండ మంచిగ బతికితె గదేచాలు. ఆడె పెట్టాలె మేం తినాలె అనేదేంలేదు. ఎదో మా రెక్కలున్నని రోజులు గిట్లనె చేసుకొని ఈ ఊళ్లనె బతు కెల్లదీస్తం'' అంటూ మారయ్య కత్తి నూరి సూరయ్య గడ్డం చేయడం మొదలు పెట్టాడు.

మారయ్య చేసే పనివిధానం ఇంకా పాతది. యాదగిరి అప్పుడప్పుడు తండ్రితో తగువు పడుతుంటాడు. నాజూకైన కత్తులు, సబ్బు తెచ్చిస్తానని మంచిసాన రాయి తెస్తానని ఎంతచెప్పినా వినడు. మారయ్య ఊళ్లో ఎంత పెద్దవారికైనా గడ్డానికి సబ్బురాయడం ఉండదు. అసలు సబ్బు అనే పదార్థం అతని వద్ద ఉండదు. అయినా పని తనంలో అతన్ని అందరూ పొగడుతుంటారు. నాగమ్మ నీళ్ల బిందెలతో ఇంటిలో కొస్తూ యాదగిరితో ''ఒరేయ్ ముందుగాల సువ్ తానం జెయ్యి మల్లపట్నం పొయ్యే పనాందన్నవ్, ఇంత బువ్వ ఉడకేస్త'' అంటూ నీళ్ల బిందెలను దించుకుంది. ఒకరి తర్వాత ఒకరుగా మారయ్య ఇంటికి క్షౌరాల కోసం వస్తున్నారు. యాదగిరి త్వరత్వరగా స్నానం, భోజనం పూర్తి చేసుకొని బస్సు కోసం పట్నం వెళ్లడానికై తయారయ్యై నిలబడ్డాడు. ''అదేందిర గట్ల నిలబడ్డవ్ పైసలేమన్న గావల్నా''? కొడుకుని ఎగాదిగా చూస్తూ ప్రశ్నించాడు మారయ్య.

''ఆ నిన్న తీస్కపోయిన ఇరవై రూపాయలు అయిపోయినయ్ ఇంకో ఇరవై కావాలి'' అన్నాడు యాదగిరి.

''నీ నౌకరేందో? ఎప్పుడొస్తదో గని ఆర్నెల్ల నుండి నీ తిరుగుళ్లకే బొచ్చెడు పైసలు ఖర్చయిపోతున్నయ్. మనింట్లేమన్న రూపాయల చెట్టుగని ఉన్నాదిరా తెంపి ఇయ్యడానికి'' వినుగులో కోపం మిళితం చేస్తూ అన్నాడు మారయ్య.

''గదేంది అన్ని గట్ల కోప్పడతవ్, ఆడేమన్న తింటానికి తాగటానికి అడుగుతున్నాడా. నౌకరి ఇంట్ల కూసుంటె వస్తాది'' నాగమ్మ ''నీదగ్గరేమన్న ఉన్నయెమో ఇయ్యి. మొన్న పటేల్ వరికోత కూళ్లి ఇచ్చిండేమోగద'' అంటూ పనిలో నడిపోయాడు మారయ్య. నాగమ్మ వంటింట్లో జొన్నల కుండలో పెట్టిన ముప్పయి రూపాయలు తెచ్చి యాదగిరి చేతికిస్తూ ''నువ్వు పొయ్యిరా నాయనా! చీకటి పడక ముందె ఇంటికిరా'' అంది కొడుకు పై అప్యాయంగా చెయ్యివేసి.

యాదగిరి రూపాయలు జేబులో పెట్టుకుని బస్సు కోసం కిలో మీటర్ దూరం నడవడానికై బయలుదేరాడు.

వాస్తవానికి తాను ఇంకా ఎంతకాలం తన తల్లిదండ్రుల్ని కష్టపెట్టాలి? ఏదో చిన్న ఉద్యోగం కనీసం ప్రైవేటులోనైన దొరికితె ఎంత బాగుండును. అమ్మానాన్నలను సుఖపెట్టుకోలేక పోయిన, తన బ్రతుకు తాను గడిపినా వారికెంతో ఊరట కలిగేది. ఉద్యోగం పరిచయస్తులందరిని అడిగాడు. కావాలంటే పదివేలు అప్పయినా ఇస్తామంటున్నారు కాని ఉద్యోగం మాత్రం ఇప్పించలేకపోతున్నారు. ఈ రోజు ఆ ప్రైవేటు చిట్‌ఫండ్ కంపెనీలో అటో ఇటో తేల్చుకోవాలి అనుకుంటూ వడివడిగా నడవ సాగాడు. పట్నంలో అతనికి నిరాశే ఆధారమయింది. రాత్రి తొమ్మిది గంటలకు నిరుత్సాహంతో తిరిగి ఇల్లు చేరుకున్నాడు. మారయ్య బీడీ వెలిగించుకుంటూ యాదగిరితో ''పోయిన పనేమైందిర'' అన్నాడు.

''ఆ ఏ ముంటుంది మామూలే ఉద్యోగాలు ఖాళీలు లేవంటారు చిన్న ఉద్యోగాలకు కూడా మినిష్టర్లు రికమండేషన్లూ, లేదంటె లంచాలు ఇచ్చి కొనుక్కుంటున్నారు. మనం రెండు చెయ్యలేని వాళ్ళం మనకెవడిస్తాడు ఉద్యోగం'' అంటూ విసుకుతో అన్నాడు. ''సరెగని బుక్కెడు తినుపో ఎప్పుడో పొద్దున తినిపోయినవ్'' ''తినక తప్పుతుందా!'' అంటూ యాదగిరి దివాళా పడినట్లు అన్నాడు. తెల్లవారక ముందె యాదగిరి నిద్రలేచి ముఖం కడుక్కొని పీటవేసి సామాన్ల పొది పక్కనపెట్టుకొని కూర్చున్నాడు. మారయ్య లేచి ''ఇదేమిట్రా? నువ్వు ఈడ కూచున్నవేంది? ఆశ్చర్యం సందేహం మిళితం చేస్తూ ప్రశ్నించాడు. ''ఏం చెయ్యమంటావయ్య ఎంతో కష్టపడి నాకు చదువు చెప్పించారు. అంతవరకు నేనూ నువ్వు చేస్తున్న పనే చేస్తానా ఇందులో నాకు అవమానం లేదు, ఆత్మాభిమానం కాని దెబ్బతినేది లేదు. చిన్నప్పట్నుండి వేసవి సెలవల్లో సరదాకై నేర్చుకున్న పని అనుభవం ఉంది. ఈ వయసులో నువ్వింకా పనిచెయ్యడం నాకిష్టం లేదు. నువ్వు కాదంటె పట్నంలోనైన ఏదో ఒక చెట్టు కింద కూర్చుని ఈ పనేచేస్తాను'' అని దృఢంగా పలకడంతో మారయ్య, నాగమ్మ అవాక్కయి శిలల్లా నిలుచుండిపోయారు.